జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
## భద్రాద్రి కొత్తగూడెం
శనివారం 05-04-2025 | పేజీలు: 6

## రామయ్యకు రెండు ఇత్తడి గొడుగులు బహుకరణ



**భద్రాచలం కల్చరల్ , ఏప్రిల్ 4(ప్రజాజ్యోతి ):** భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానంలో స్వామివారికి యూఎస్ఏకు చెందిన బుర్ర అరుణ్, బుర్ర రత్నబాల దంపతులు శుక్రవారం రూ. 1.15లక్షల విలువైన రెండు ఇత్తడి గొడుగులను బహుకరించారు.



వాటిని ఆలయ అధికారులకు అర్చకుల సమక్షంలో అప్పగించారు. అనంతరం స్వామివారిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



# వైభవం.. ధ్వజారోహణం

- శాస్త్రోక్తంగా పూర్తయిన వేడుక
- సంతాన ప్రాప్తి కోసం మహిళలకు గరుడ ప్రసాదం
- భేరీపూజతో ముక్కోటి దేవతలకు ఆహ్వానం
- నేడు కల్యాణంలో కీలక ఘట్టమైన ఎదుర్కోలు ఉత్సవం

4లో

## పర్ణశాల దర్శనం..
# పరమపావనం



### వనవాసంలో రాముడు నడయాడిన పుణ్యభూమి
### ఇప్పటికీ నారచీరలు, మాయలేడి అడుగుల ఆనవాళ్లు

**భద్రాచలం కల్చరల్ ,ఏప్రిల్ 4(ప్రజాజ్యోతి ):**

పవిత్ర గోదావరి తీరంలో సీతా లక్ష్మణ సమేతుడైన శ్రీ రాముడు వెలిసిన పర్ణశాల పుణ్యక్షేత్రం శ్రీరామనవమికి ముస్తాబవుతోంది. ఈ నెల 6న సీతారాముల కల్యాణ మహోత్సవం వైభవంగా జరగనుంది. భద్రాచలం శ్రీ సీతారామ చంద్రస్వామివారిని దర్శించుకున్న భక్తులందరూ ఇక్కడి రామాలయానికి వస్తుంటారు. ఈ నేపథ్యంలో పర్ణశాల ప్రత్యేకతను తెలుసుకుందాం.

**పంచవటీ కుటీరం..**

వనవాస కాలంలో సీతారామలక్ష్మణులు గోదావరి తీరంలోని ఐదు మర్రి చెట్లు కలిసి ఉన్న చోట పంచ వటీ కుటీరం నిర్మించుకున్నారు. శ్రీరాముడు

2లో



## విద్యుత్తు లైన్లను మరమ్మతులు చేస్తున్న సబ్ స్టేషన్ సిబ్బంది



- అకాల వర్షానికి కూలిన భారీ వృక్షాలు
- పలుచోట్ల తెగిపడిన విద్యుత్ తీగలు
- స్పందించిన సబ్ స్టేషన్ అధికారులు

4లో

**కొత్తగూడెం కలెక్టరేట్, ఏప్రిల్ 4, ప్రజా జ్యోతి:** గురువారం రాత్రి ఒకసారి గా కురిసిన భారీ వర్షానికి పాల్వంచ పట్టణంలో పలు ప్రాంతాలలో భారీ వృక్షాలు నేలకొరిగాయి, అదేవిధంగా మండల పరిధిలోని పలుచోట్ల విద్యుత్తు స్తంభాలు కింద పడటంతో హెవీ విద్యుత్ లైన్లోకి సంబంధించిన తీగలు చెట్ల మీద పడడంతో రాత్రి 10:00 నుండి 12 గంటల వరకు

# పర్ణశాల దర్శనం.. పరమపావనం



మొదటి పేజీ తరువాయి

14 ఏళ్ల పాటు సీతమ్మతో కలిసి వనవాసం చేయగా, పర్ణశాల ప్రాంతంలోనే రెండున్నర సంవత్సరాలు నివసించినట్లు ప్రతీతి. అక్కడ నిత్యం ప్రవహించేవాగు వద్ద సీతమ్మ స్నానం చేసినట్లు చెబుతారు. ఆ తర్వాత ఇక్కడి రథంగుట్టపై ఆమె ధరించే చీరలు ఆరవేయగా, దానిపై ఆ చీరల ఆనవాళ్లు ఏర్పడి నట్లు ఒక కథనం. ఇక్కడ ప్రవహించే గోదావరి నది అత్యంత పావనమైనదని కొన్ని ప్రత్యేక సందర్భా ల్లో సీతమ్మవారు స్నానమాడిన సీతవాగు లక్ష్మణ స్వామి బాణాహతికి ఏర్పడిన పుణ్యతీర్థమని చెబుతారు. శ్రీరాముడు కూర్చున్న రాతి సింహాసనం, నార చీరలు, సీతమ్మ ఉపయోగించిన పసుపు, కుంకుమ రాళ్లు మాయలేడి అడుగుల గుర్తులు, శ్రీరామ పాద చిహ్నములు, సీతారాములు ఆడుకున్న వామన గుంటలు, కందమూలాలను ఆరగించిన రాతి కంచాలను ఇప్పటికీ పర్ణశాలలో దర్శించుకోవచ్చు.

**శ్రీరామ దర్శనం పరవపావనం///**

శ్రీసీతారామ లక్ష్మణుల పవిత్ర పాదస్పర్శతో పులకరించిన ఈ పుణ్యభూమి సందర్శనం సకలభీష్ట పదం. శ్రీరామునికి ఆదివారం ప్రీతికరమైంది. ఏకాదశి పూర్ణిమ, అమావాస్య శుక్రవారం సంకరణం, పునర్వసు వంటి పవిత్ర రోజుల్లో పర్ణశాల విశ్వక రాముని దర్శనం పరమపావనమని భక్తులు విశ్వసిస్తారు.

**పర్ణశాల పేరెలా వచ్చిందంటే///**

శ్రీరాముడు వనవాస సమయంలో ఆశ్రమాన్ని నిర్మించుకుని కొంతకాలం నివసించాడు. ఆశ్రమం చుట్టూ భారీగా చెట్లు కనిపిస్తాయి. 'పర్ణ' అంటే ఆకులు అని అర్థం. శాల అంటే ఇల్లు అని అర్థం. ఈ క్రమంలోనే పర్ణశాల అనే పేరు వచ్చిందని చెబుతారు. రాముడు ఇక్కడికి సమీపంలోని శివకేవ్ అనే గుహలో శివునికి ప్రార్థనలు చేసేవాడని చెబుతారు. పర్ణశాల చరిత్ర వేదకాలం నాటిది. వేదాలు అడవుల ప్రాముఖ్యత, వాటి పరిరక్షణ గురించి ప్రస్తావించాయి. పర్ణశాల చుట్టూ ఉన్న అడవులు పవిత్రమైనవిగా పరిగణిస్తారు. భద్రాచలానికి 35 కిలోమీటర్ల దూరంలోని పర్ణశాలకు అరగంట కు ఓ బస్సు ఉంటుంది. శ్రీరామనవమి రోజు ఐదు నిమిషాలకు ఓ ఆర్టీసీ తిప్పుతామని ఆర్టీసీ అధికారులు పేర్కొంట వాహనాలు కూడా అందుబాటులో ఉంటాయి.

# అక్రమ కేసులను ఎత్తివేయాలి


**- బీజేపీ జిల్లా అధ్యక్షులు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి**

**భద్రాచలం టౌన్, ఏప్రిల్ 4 (ప్రజాజ్యోతి):**

వెంకటాపురం మండలం, చిరుతపల్లి గ్రామంలో రైతుల ఆత్మహత్యలతో మొదలయిన, నకిలీ విత్తనాలకు వ్యతిరేఖంగా జరుగుతున్న పోరాటాన్ని ప్రక్కదారి పట్టించేలా, ఆ పోరాటాన్ని ముందుండి నడిపిస్తున్న వెంకటాపురం బీజేపీ మండల అధ్యక్షులు రాజశేఖర్ పై అవినీతి కాంగ్రెస్ నాయకుల అండతో, పోలీసులు కనీస విచారణ జరపకుండా, అక్రమంగా ఫోక్సో చట్టం కేసు నమోదు చేసి పోరాటాన్ని అణగ తొక్కే ప్రయత్నాలను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని బీజేపీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు శ్రీ బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి అన్నారు.

శుక్రవారం పట్టణంలోని నిర్వహించిన ప్రెస్ మీట్ లో బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్, ఆదివాసీ నాయకులు కుంజా ధర్మా, ప్రభాకర్ రెడ్డి పాల్గొని వారు మాట్లాడుతూ రాజశేఖర్ పై నాటకీయంగా జరిగిన కుట్ర పరిణామాలు, కేసు నమోదు సంఘటనలను తీవ్రంగా ఖండించారు.

ఆదివాసీ రైతుల ఆత్మహత్యల సంఘటనపై విచారణకు జాతీయ ఎస్టీ కమీషన్ సభ్యులు జాటోత్ హుస్సేన్ నాయక్ విచ్చేస్తున్న సందర్భంగా ముందే సదరు నాయకులు పోరాటాన్ని నీరు కార్చి, నకిలీ విత్తనాలను అమ్మే వ్యాపారులను కాపాడే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. జరిగిన సంఘటనపై పోలీసులు, ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరిపి, రాజశేఖర్ పై అక్రమంగా పెట్టిన కేసులను



ఎత్తివేయాలని,
రైతులకు ఎక్స్-గ్రేషియా చెల్లించాలని, నాసిరకం విత్తనాలను అమ్మే వ్యాపారులపై, కంపెనీలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు

ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు బాలు నాయక్, గిరిజన మోర్చా రాష్ట్ర కార్యదర్శి భూక్యా రవి నాయక్, జిల్లా ప్రధాన కార్యదర్శి చింతలచెర్వు శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షులు పసుమర్తి సతీష్, జిల్లా కౌన్సిల్ మెంబర్ నిడదవోలు నాగబాబు, మండల అధ్యక్షులు ముత్యాల శ్రీనివాస్ మరియు బీజేపీ నాయకులు కన్నెధార వరప్రసాద్, ములిశెట్టి రామ్మోహన్ రావు, చెల్లుబోయిన వెంకన్న, అల్లాడి వెంకటేశ్వర్లు, పిసి కేశవ్, శ్రీనివాస్ గౌడ్, కె ముక్తేశ్వరరావు, నిఖిల్, కె శ్రీను తదితరులు పాల్గొన్నారు.



# సీతారాముల కళ్యాణానికి ఎమ్మెల్యేని ఆహ్వానించిన ఆలయ కమిటీ

**బూర్గంపహాడ్,ఏప్రిల్ 04(ప్రజా జ్యోతి):**

మండలంలోని నాగినేని ప్రోలు రెడ్డిపాలెం గ్రామంలో జరగనున్న శ్రీ సీతారామచంద్రస్వామి కళ్యాణానికి నియోజకవర్గం శాసనసభ్యులు వెంకటేశ్వర్లను ఆలయ కమిటీ సభ్యులు శుక్రవారం మణుగూరు లోని ఎమ్మెల్యే నివాసానికి వెళ్లి ఆహ్వానించారు. ఆలయ కమిటీ ఆహ్వానం మేరకు నాగినేని ప్రోలు రెడ్డి పాలెం గ్రామంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి వారి ఆలయానికి విచ్చేస్తున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ నాయకులు బిజ్జం వెంకటేశ్వర రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు మొండిద్దుల వెంకటేశ్వర్ రెడ్డి, ఎడమ కంటి పిచ్చిరెడ్డి,పాలెం లక్ష్మిరెడ్డి ,కాటం వెంకట్రామిరెడ్డి తదితరులు ఉన్నారు.



# శ్రీ సీతారామచంద్ర స్వామి వారి కళ్యాణానికి అంకురార్పణ

**- పసుపు కొట్టే కార్యక్రమానికి తరలివచ్చిన మహిళలు**

**బూర్గంపహాడ్,ఏప్రిల్ 04(ప్రజా జ్యోతి):**

బూర్గంపహాడ్ మండల పరిధిలోని నాగినేని ప్రోలు రెడ్డిపాలెం గ్రామంలో కొలువై ఉన్న శ్రీ సీతారామచంద్ర స్వామి వారి ఆలయంలో రేపు జరగనున్న కళ్యాణ మహోత్సవ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం అంకురార్పణ పసుపు కొట్టే కార్యక్రమం ప్రారంభమైంది. తెల్లవారుజామున 4 గంటలకు సుప్రభాత సేవ, మహాభిషేకం అలంకరణ , అర్చన బాలబోగ నివేదన తీర్థ ప్రసాదములు భక్తులకు అందజేశారు .అత్యంత భక్తిశ్రద్ధలతో గ్రామంలోని మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని అంకురార్పణ పసుపు కొట్టే కార్యక్రమం ప్రారంభించారు. సాయంత్రం ఏడు గంటల నుంచి శాంతి హోమం , మహా సుదర్శన హోమం ఆలయ ప్రధాన అర్చకులు మురళీకృష్ణమాచార్యులు , వేద పండితుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఆలయం పరిసరాలు రామనామ స్మరణ తో మారు మోగింది. రాత్రి 9 గంటల నుంచి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.ఈసారి స్వామివారి కళ్యాణానికి ఆలయం ఆవరణ నాలుగు కూడలి నందు విద్యుత్ అలంకరణ ప్రధాన ఆకర్షణగా నిలుస్తున్నాయి.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ,గ్రామ పెద్దలు గ్రామస్తులు,భక్తులు,పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# రామం భజే ఆడియో సిడి ఆవిష్కరించిన కలెక్టర్

**భద్రాచలం, ఏప్రిల్ 4, ప్రజాజ్యోతి :**

దేశ విదేశాల నుండి శ్రీ సీతారామచంద్ర స్వామిని దర్శించుకునే భక్త జనానికి వినుల విందైన సంగీతంతో పాటు, మైమరిపించే గానామృతంతో భక్తజనం పులకించడానికి ఎన్నిసార్లు విన్నా తనివి తీరని రామాయణ గాధ భద్రాచల సీతారామ చంద్ర స్వామిదని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. శుక్రవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఏ ఆర్ మ్యూజికల్స్ సంస్థ వారు రూపొందించిన రామం భజే ఆడియో పాట సిడిని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి చరిత్ర ఎన్ని సార్లు చదివినా, పాటలు విన్న తనివి తీరదని, అటువంటి సీతారామచంద్ర స్వామి కొలుస్తూ ఆయన చరిత్రను పాట రూపంలో రూపొందించి భక్తుల దరికి చేరడంలో కృషిచేసిన ఏఆర్ మ్యూజికల్స్ సంస్థ సభ్యులకు ఈ సందర్భంగా అభినందిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏ ఆర్ మ్యూజిక్ అధ్యక్షులు శ్రీరామ్, రమేష్, హరినాథ్, సభ్యులు రచయిత మూర్తి, గాత్రం అరుణ రామ్, సంగీతం దేవి ప్రేమ్, వీరభద్రరావు , లక్ష్మి శివరాంజీ, విశ్వనాధ్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ జన్మదిన వేడుకలు

**బూర్గంపహాడ్,ఏప్రిల్ 04(ప్రజా జ్యోతి):**

బూర్గంపాడు మండలంలోని కృష్ణ సాగర్ గ్రామంలో జాతీయ మాల మహానాడు వ్యవస్థాపక అధ్యక్షులు,ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ జన్మదిన వేడుకలను జాతీయ మాల మహానాడు జిల్లా మహిళా అధ్యక్షురాలు బోడ దివ్య ఆధ్వర్యంలో స్వీట్స్ పంచి ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా జాతీయ మాల మహానాడు జిల్లా మహిళా అధ్యక్షురాలు బోడ దివ్య మాట్లాడుతూ దళిత ముద్దుబిడ్డ , తెలంగాణ ఉద్యమ నేత అద్దంకి దయాకర్ భవిష్యత్తులో ఎన్నో జన్మదిన వేడుకలు జరుపుకోవాలని,ఉన్నతమైన శిఖరాలకు ఎదగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో రాయపూడి నిర్మల, బెజ్జం రాణి, ఎలిజాల కళ, ఎలిజాల అగ్ని, అంతోటి నిర్మల, అంతోటి నందిని, భూదేవి, మల్ల రామచందర్, మోత్కూరు లక్ష్మి, అంతోటి సూరి, అంతోటి పూజ, అంతోటి లీల, బోడ కృష్ణ, రాయపూడి రమేష్ తదితరులు పాల్గొన్నారు.



# 6న ఉదయమే అధికారులు విధుల్లో ఉండాలి

**-ఎవరి సెక్టార్లలో వారు బాధ్యతతో వ్యవహరించాలి -జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్**

**భద్రాచలం, ఏప్రిల్ 4, ప్రజాజ్యోతి :**

శ్రీ సీతారామచంద్ర స్వామి వారి కళ్యాణం , పట్టాభిషేకం మహోత్సవమునకు వివిధ సెక్టార్లలో విధులు నిర్వహించే అధికారులు 06వ తేదీ ఉదయం 06 గంటలకు తమ విధులలో అందరూ హాజరు కావాలని నిర్లక్ష్యం వహించే అధికారులపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. శుక్రవారం భద్రాచలం లోని సబ్ కలెక్టర్ కార్యాలయం సమావేశ మందిరంలో శ్రీ సీతారామచంద్రస్వామి కళ్యాణం, పట్టాభిషేకం మహోత్సవములకు విధులు కేటాయించబడిన లైజన్ ఆఫీసర్లు, సెక్టోరియల్ ఆఫీసర్లు వివిధ శాఖల అధికారులతో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెక్టార్లలో డ్యూటీలు కేటాయించబడిన అధికారులు 06 వోతేదీ ఉదయం విధులలో చేరుకొని భక్తులు , వీఐపీలు, వీవీఐపీలు వారి సెక్టార్లలో కూర్చునే విధంగా చూడాలని, వృద్ధులు, చిన్నపిల్లలు, మహిళలు, సీనియర్ సిటిజన్లను, అనారోగ్యంతో ఉన్న వారి పట్ల ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. సంబంధిత అధికారులు పోలీస్ సహకారం తప్పనిసరిగా తీసుకోవాలని, ఎవరైనా భక్తులు అస్వస్థతకు గురి అయితే వెంటనే దగ్గరలో ఉన్న వైద్య శిబిరానికి తరలించి వైద్య చికిత్సలు చేయించాలని అన్నారు. వీఐపీలు, వివిఐపీల వెంట వచ్చే సిబ్బంది ఎవరైనా ఏమైనా గొడవలకు దిగితే పోలీస్ సహకారం తీసుకొని గొడవలు కాకుండా చూడాలని, దేవుని




దగ్గర అందరం సమానమే అని వారికి నచ్చ చెప్పాలని అన్నారు. ఏమైనా సమస్య ఉంటే వెంటనే వాకిటాకిల ద్వారా కంట్రోల్ రూమ్ కు తెలియజేయాలని అన్నారు. ముఖ్యంగా 06 తేదీ శ్రీ సీతారామచంద్ర స్వామి వారి కళ్యాణానికి తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు, 07 వ తారీకు పట్టాభిషేకం కార్యక్రమంకు తెలంగాణ రాష్ట్ర గవర్నర్ స్వామివారికి ముత్యాల తలంబ్రాలు పట్టు వస్త్రాలు అందజేయడానికి వస్తున్నందున, కార్యక్రమంలో ఎటువంటి ఆటంకాలు లేకుండా విజయవంతంగా జరిగేలా అధికారులు కృషి చేయాలని, లైజన్ ఆఫీసర్ల పర్యవేక్షణ చాలా పగడ్బందీగా ఉండాలని, సెక్టరల్ అధికారులు మీ సిబ్బందిని అప్రమత్తం చేసి భక్తులకు సహాయ సహకారాలు అందించే విధంగా చూడాలని తెలుపుతూ, శ్రీరామనవమి వేడుకలలో పాల్గొన్న సిబ్బందికి ఆర్డీఓ కార్యాలయంలో భోజన వసతి సౌకర్యాలు కల్పించామని అన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ వేణుగోపాల్, ఐటీడీఏ పీవో బి రాహుల్, డి ఆర్ డి ఓ విద్యాచందన, ఆర్డీవో దామోదర్ రావు, వివిధ శాఖల అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఆదివాసి మ్యూజియంలో లంబాడీల బొమ్మలను తక్షణమే తొలగించండి



ఆదివాసి సంక్షేమ పరిషత్ జాతీయ అధ్యక్షులు దాట్ల నాగేశ్వరరావు

**భద్రాచలం టౌన్, ఏప్రిల్ 4, ప్రజాజ్యో :**

ఆదివాసి సంస్కృతికి, సాంప్రదాయాలకు విరుద్ధంగా భద్రాచలం ట్రైబల్ మ్యూజియంలో ఏర్పాటు చేసిన లంబాడిల బొమ్మలను తక్షణమే తొలగించాలి లేదంటే ముట్టడి తప్పదు అని ఆదివాసి సంక్షేమ పరిషత్ జాతీయ అధ్యక్షులు దాట్ల నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ని అభ్యుదయ భవన్లో ఏర్పాటుచేసిన ఆదివాసి సంక్షేమ పరిషత్ సమావేశంలో అయన పాల్గొని మాట్లాడుతూ ఐటీడీఏ పరిధిలో ఆదివాసీ సంస్కృతి, సాంప్రదాయాలను, ఆదివాసీల ఔన్నత్యాన్ని గత, ప్రస్తుత ఆచార వ్యవహారాలను బాహ్య ప్రపంచానికి, భవిష్యత్ తరాలకు తెలియపరిచే విధంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేత పి.ఓ.ఐటీడీఏ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న ట్రైబల్ మ్యూజియం చాలా హర్షించదగ్గ విషయం అని అన్నారు. ఇతర రాష్ట్రాలు గుజరాత్, మహారాష్ట్ర, రాజస్థాన్ నుంచి వలస వచ్చిన లంబాడాల సంస్కృతి సాంప్రదాయాలను తెచ్చి ఆదివాసి మ్యూజియంలో పెట్టడం ఎంతవరకు సబబు అని ప్రశ్నించారు. లంబాడీల సంస్కృతి పైన తెలంగాణ ప్రభుత్వం కి ప్రత్యేక అభిమానం ఉంటే మైదాన ప్రాంతాల్లో లంబాడాలకు కొంత ప్రాంతాన్ని కేటాయించి కెసిఆర్ ఏ విధంగానైతే హైదరాబాదులో బంజారా భవన్, ఆదివాసి భవన్ అని విడివిడిగా భవన్ నిర్మించి కేటాయించినారో, అదేవిధంగా తెలంగాణ ప్రభుత్వం కూడా వారికి వేరే భవనం నిర్మించి ఇవ్వాలని అన్నారు. మ్యూజియంలో లంబాడీల సంస్కృతిని పెట్టడం వల్ల మా సంస్కృతి సంప్రదాయాలు నాశనమయ్యే ప్రమాదం ఉన్నదని ఆవేదన వ్యక్తం చేశారు. లంబాడీల విగ్రహాలను తక్షణమే తొలగించనట్లయితే కచ్చితంగా సీఎం ప్రోగ్రాం ని అడ్డుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఆదివాసి సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షులు సోయం కామరాజు , రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ ఈసాల సురేష్ , భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు వాగబోయిన చంద్రయ్య దొర , దుమ్ముగూడెం మండల అధ్యక్షుడు కురసం రవి , లక్ష్మీదేవి పల్లి మండల నాయకులు జోగ రవి , రామారావు, పుల్లారావు, వీరభద్రం తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్తు లైన్లను మరమ్మతులు చేస్తున్న సబ్ స్టేషన్ సిబ్బంది



**మొదటి పేజీ తరువాయి**

పాల్వంచలో విద్యుత్ ఉత్పత్తికి అంతరాయం ఏర్పడింది, దీంతో స్పందించిన పాల్వంచ సబ్ స్టేషన్ అధికారులు, సీనియర్, జూనియర్ లైన్మెన్లు, హెల్పర్లు రాత్రి వేళలో రెండు గంటల పాటు శ్రమించి విద్యుత్తు లైన్లను మరమ్మతులు చేసి ప్రజలు ఎలాంటి ఇబ్బందులు పడకుండా విద్యుత్ పునరుద్ధరించారు, ఈ కార్యక్రమంలో సబ్ స్టేషన్ ఎస్ ఈ, మహేందర్ రెడ్డి, డి ఈ సుందరయ్య, ఏఈ ప్రతాప్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు

# వైభవం.. ధ్వజారోహణం

**భద్రాచలం కల్చరల్ ,ఏప్రిల్ 4, ప్రజాజ్యోతి :**





భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి తిరుకల్యాణ బ్రహ్మోత్సవాల్లో ప్రధాన ఘట్టమైన ధ్వజారోహణ వేడుకను ఆలయ అర్చకు లు శుక్రవారం వైభవంగా నిర్వహించారు. శ్రీ మహా విష్ణువుకు ప్రీతిపాత్రుడైన గరుత్మంతుడి చిత్ర పటాన్ని తెల్లటి వస్త్రంపై చిత్రించి ధ్వజస్తంభంపై ఎగురవేశారు. ఉదయం యాగశాలలో తిరువారాధన, సేవా కాలం, నివేదన, మంగళాశాసనం, తీర్థప్రసాద విని యోగం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఎలాంటి విఘ్నాలు కలగకుండా ఉండేందుకు సేనాధిపతి, విఘ్ననాశకుడు అయిన విశ్వక్సేన అర్చన గావించి, పుణ్యావాచనం, మూర్తి కుంభావాహన, భద్రక మండల ఆరాధన, ద్వార తోరణ ఆరాధన నిర్వహించి నవాహ్నిక దీక్షకు అగ్ని ప్రతిష్ఠాపన చేశారు. గరుడ పటంతో యాగ శాల నుంచి ఆలయం చుట్టూ ప్రదక్షిణగా తీసుకొచ్చి ఆరాధన చేశారు. గరుడ మహా సంకల్పం, గరుడ గద్యనం, గరుడ మంగళాష్టకాలను ప్రధానార్చకులు పఠించగా, మంగళ వాయిద్యాల నడుమ ధ్వజారోహణం గావించారు. అనంతరం బలిహరణం చేసి, సంతానం లేనివారికి గరుడముద్దలను ప్రసాదంగా అందజేశారు. ఈ గరుడ ముద్ద తీసుకున్న వారికి సంతానం కలుగుతుందని భక్తుల నమ్మకం. ఈ ప్రసాదాన్ని స్వీకరించేందుకు మహిళా భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఇక సాయంత్రం యాగశాలలో భేరీ పూజ నిర్వహించి.. శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవానికి ముక్కోటి దేవతలను ఆహ్వానించారు. ఆయా కార్యక్రమాల్లో ఆలయ ఈఓ ఎల్. రమాదేవి , ఏఈఓలు శ్రవణ్ కుమార్ , భవాని రామకృష్ణ, ఆలయ ప్రధాన అర్చకులు , వేద పండితులు పాల్గొన్నారు.

**మా వంశమే గొప్పదంటూ..**

'అందమైన మా రామయ్య వంశమే గొప్పది' అం టూ ఆయన తరఫు అర్చకులు ఒకవైపు.. 'కాదు..కాదు.. మా చక్కనైన సీతమ్మ తల్లి వంశమే గొప్పది' అంటూ మరోవైపున అమ్మవారి తరఫు అర్చకులు.. ఇలా లయబద్ధంగా నాట్యమాడుతూ సరదాగా సాగే ఎదుర్కోలు వేడుకలకు శనివారం సాయంత్రం మిథిలా స్టేడియం వేదిక కానుంది. శ్రీ సీతారాముల కల్యాణ మహోత్స వానికి ఘడియలు సమీపిస్తున్న తరుణంలో కీలక ఘట్టమైన ఎదుర్కోలు ఉత్సవానికి ఆలయ అర్చకు లు, అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. హిందూ సంప్రదాయం ప్రకారం జరిగే ప్రతీ కల్యాణంలోనూ ఎదుర్కోలు ఉత్సవం నిర్వహిస్తారు. ఇక ఆదర్శ జం టకు ప్రతీకలైన శ్రీ సీతారాముల తిరు కల్యాణం సందర్భంగా స్వామి, అమ్మవార్ల వంశాల గొప్పదనాన్ని వివరించే ఈ వేడుక ఆద్యంతం భక్తులకు కనువిందు చేస్తుంది. మిథిలా స్టేడియం సీతమ్మ వారికి మిథిలా నగరం కాగా, మరో పక్కనున్న వైకుంఠ ద్వారం రామయ్యకు చెందిన అయోధ్యగా అభివర్ణిస్తూ పండితులు కనులపండువగా ఈ వేడుక జరుపుతారు. అలాగే హిందూ, ముస్లింల మధ్య సామరస్యాన్ని పెంపొందించేలా భక్తులందరికీ పన్నీరు చల్లడం ఈ ఉత్సవంలో మరో ప్రత్యే కథ. గోల్కొండ నవాబైన తానీషాను స్మరింపజేస్తూ భద్రాచలం దేవస్థానంలో ఈ సంప్రదాయాన్ని ఇప్పటికీ కొనసాగించడం విశేషం. కాగా నవాహ్నిక తిరుకల్యాణోత్సవాల్లో భాగంగా ఆదివారం శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవం, సోమవారం పట్టాభి .షేకం వేడుకలు జరపనున్నారు.


# డ్రెస్ కోడ్ కమిటీ నిర్ణయాలు కాంట్రాక్టు కార్మికులకు కూడా అమలు చేయాలి

**ఇల్లందు, ఏప్రిల్ 4, ప్రజాజ్యోతి:**



కోల్ ఇండియా డ్రెస్ కోడ్ కమిటీ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలు కాంట్రాక్టు కార్మికులకు కూడా అమలు చేయాలని టియుసీఐ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ యాకూబ్ షావలి డిమాండ్ చేశారు. శుక్రవారం మీడియాకు విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ సింగరేణిలో ఇప్పటికైనా నో వర్క్ నో పే నిబంధనను అమలు చేయాలన్నారు. సింగరేణి సీ అండ్ యండి ఇప్పటికైనా వేతనాల పెంపుకై చర్యలు తీసుకోవాలన్నారు. సింగరేణిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుడు ఏదైనా కారణాలతో గైర్హాజరైతే రోజుకు రూ. 300 పెనాల్టీ విధిస్తూ గతంలో ఇచ్చిన సర్కులర్ ను సవరించిన సింగరేణి సి అండ్ యండికి ధన్యవాదాలు తెలిపారు. సింగరేణిలో నో వర్క్ నో పే నిబంధనను వందకు వందశాతం అమలు చేయాలని కోరారు. డ్రెస్, షూలు సంవత్సరానికి ఒకసారి రూ. 10,500 వాషింగ్ అలవెన్స్ రూ. 185 చెల్లించడానికి యాజమాన్యం అంగీకరించిందన్నారు. ఈ నిర్ణయాన్ని డ్రెస్ షూ వాషింగ్ అలవెన్స్, సంస్థలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు కూడా వర్తింపజేయాలని కోరారు. 2017లో వేతనాలు పెరిగాయని, ఇంతవరకు వేతనాలు పెరగకపోవడం బాధాకరమని 16 నెలల కాంగ్రెస్ ప్రజా పాలనలో కాంట్రాక్ట్ కార్మికుల వేతనాల పెరుగుదలకై కార్మికులు ఎదురుచూస్తున్నారని పేర్కొన్నారు. కార్మికుల వేతనాలు పెంచితే రాష్ట్ర ప్రభుత్వం ఖజానాపై భారం పడదని సింగరేణి యాజమాన్యమే చెల్లిస్తుందన్నారు. తక్షణమే వేతనాల పెరుగుదలపై సింగరేణి యాజమాన్యం ప్రభుత్వం మీద ఒత్తిడి పెంచాలని కోరారు.

# లారీ అసోసియేషన్ లీగల్ అడ్వైజర్ గా సుధాకర్



**ఇల్లందు, ఏప్రిల్ 4, ప్రజాజ్యోతి:**

ఇల్లందు, కోయగూడెం లారీ ట్రాన్స్పోర్ట్ అసోసియేషన్ లీగల్ అడ్వైజర్ గా మాజీ ఏజిపి, న్యాయవాది కలవల సుధాకర్ ను శుక్రవారం నియమించారు. తనను లారీ ట్రాన్స్పోర్ట్ అసోసియేషన్ లీగల్ అడ్వైజర్ గా నియమించేందుకు సహకరించిన ఎమ్మెల్యే కోరం కనకయ్య- లక్ష్మి దంపతులు, లారీ ట్రాన్స్పోర్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు నెలవెల్లి నరసింహారావు, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కోరం సురేందర్ కు కలువల సుధాకర్ కృతజ్ఞతలు తెలిపారు.

# అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానం

**అన్నపురెడ్డిపల్లి ఏప్రిల్ 4 (ప్రజా జ్యోతి).**

అన్నపురెడ్డి పల్లి మండల కేంద్రంలోని మహాత్మ జ్యోతిబాపూలే వెనుకబడిన తరగతుల సంక్షేమ బాలుర డిగ్రీ గురుకుల కళాశాలలో ఖాళీగా ఉన్న అతిథి అధ్యాపక పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రత్యేక అధికారి ఎస్కే. బురాన్ ఒక ప్రకటనలో తెలిపారు. గణితము, తెలుగు,కామర్స్, ఫిజిక్స్ సబ్జెక్టుల్లో ఒక్కొక్కటి చొప్పున ఖాళీలు ఉన్నాయని తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు రఘునాథ్ పాలెం లోని బీసీ మహిళా కళాశాలలో ఈనెల 7 నిర్వహించే డెమో, ఇంటర్వ్యూలకు హాజరు కాగలరు తెలిపారు.

# గత సంప్రదాయాన్ని కొనసాగిస్తూ విలేకరుల పాసులు జారీ చేస్తాం

### రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**భద్రాచలం ,ఏప్రిల్ 4(ప్రజాజ్యోతి ):**

భద్రాచలం జరిగే సీతారాముల కళ్యాణం, పట్టాభి షేకం కు హాజరయ్యే విలేకరులకు జిల్లా యంత్రాంగం పాసులు జారీ చేస్తుందని, దీనిపై ఎటువంటి భయాందోళన చెందాల్సిన పనిలేదని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు. ఎంతోకాలంగా విలేకరులు రాముడి సేవలో ఉంటూ భద్రాద్రి అభివృద్ధికి కృషి చేస్తున్నారని వారికి గతంలో ఏ విధంగా శ్రీరామనవమి పాసులు జారీ చేశారో అదే విధంగా ఈ ఏడాది కూడా సమాచార శాఖ ద్వారా విలేకరులకు పాసులు పంపిణీ చేస్తారని, ఈ విషయంపై జిల్లా కలెక్టర్ ను ఆదేశించినట్లు కూడా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు శ్రీరామనవమి ఉత్సవానికి విలేకరులకు పాసులు పంపిణీ చేస్తామని మంత్రి తుమ్మల తెలియజేయడంతో భద్రాచలంలోని విలేకరులు విలేకరుల సంఘాలు మంత్రికి కృతజ్ఞతలు తెలియజేశారు.

# రామయ్య కళ్యాణం అయ్యప్ప భోజనం



**భద్రాచలం టౌన్, ఏప్రిల్ 4 (ప్రజాజ్యోతి):**

శ్రీ సీతారామచంద్ర-సీతమ్మ వారి కళ్యాణోత్సవ రామనవమి సందర్భంగా భద్రాద్రి హరిహర క్షేత్రం శ్రీ అయ్యప్ప స్వామి వారి ప్రాంగణం లో యాత్రికులకు శ్రీ హరినామ సంకీర్తన వారి భోజన వితరణ కార్యక్రమం జరుగుతుంది అని ఆలయ పాలక వర్గ సభ్యులు తెలియజేసారు. గత 20 ఏళుల్గా జరుగుతున్న ఈ కార్యక్రమం మానవ సేవే మాధవ సేవగా ప్రతి ఏడు కొన్ని వేలమంది భక్తుల ఆకలి దప్పికలు తీర్చుతుండడం విశేషం అని,భద్రాద్రి హరిహర క్షేత్రం లో భోజనం ఆరగించడం చాలా అదృష్టంగా భావిస్తామని రాముడి కల్యాణానానికి స్వయానా అయ్యప్ప స్వామే భోజనం అందిస్తున్నట్టు అనిపిస్తుంది అని భక్తులు చెప్పుకోవడం విశేషంగా భావిస్తునాం అని సంతోషం వ్యక్తం ఆలయ కమిటీ సభ్యులు వ్యక్తం చేశారు.



# బిల్లు ఉపసంహరించుకునే దాకా పోరాటం ఆగదు

### చంద్రబాబు, నితీష్ చరిత్రహీనులుగా మిగిలి పోతారు.

### ఆలిండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు ఆధ్వర్యంలో దేశవ్యాప్త ఉద్యమం

**ములకలపల్లి, ఏప్రిల్ 04, ప్రజా జ్యోతి:**

కేంద్రంలోని భా. జ. పా సర్కార్ లోక్ సభ, రాజ్య సభల్లో మందబలంతో వక్ఫ్ సవరణ బిల్లు 2024 నల్ల చట్టాన్ని ఆమోదింప జేసుకోవడం దుర్మార్గమైన, సిగ్గుమాలిన చర్య అని సీనియర్ జర్నలిస్టు, జమాతె ఇస్లామీ హింద్ జాతీయ సభ్యులు యండి. ఉస్మాన్ ఖాన్ ధ్వజమెత్తారు. శుక్రవారం మండల పరిధిలోని జగన్నాథపురంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చంద్రబాబు నాయుడు, నితీష్ కుమార్ , చిరాగ్ పాశ్వాన్ , జయంత్ చౌదరి లు రాజ్యాంగ విరుద్ధమైన మోడీ, షా ల ప్రతిపాదిత నల్ల చట్టానికి మద్దతు తెలిపి చరిత్ర హీనులుగా మిగిలి పొయ్యారని విమర్శించారు. దేశంలోని అతి పెద్ద రెండవ మెజారిటీ వర్గమైన ముస్లింల మనోభావాలను, ప్రతి పక్షాలు, పౌర సంఘాల అభ్యంతరాలను ఏమాత్రం పట్టించుకోకుండా 'పరివార్ '



ప్రభుత్వం ఏక పక్షంగా వ్యవహరించిందని, దానికి చంద్రబాబు నితీష్ కుమార్ లు బేషరతుగా ప్రత్యక్ష మద్దతునిచ్చారని, త్వరలోనే వీరు తగిన మూల్యం చెల్లించుకుంటారని హెచ్చరించారు. రాజ్యాంగ విరుద్ధమైన ఈ నల్ల చట్టాన్ని ఉపసంహరించుకొనే దాకా ఆలిండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు చేపట్టబోయే ప్రతి కార్యక్రమానికి ముస్లింలందరూ వెన్నంటి నిలుస్తారని ఆయన చెప్పారు. ఈకార్యక్రమంలో షేక్ అబ్దుల్ జబ్బార్, బాజీబాబా, యాఖూబ్, షబ్బీర్, జాఫర్ , సమీ తదితరులు పాల్గొన్నారు.

# ఈద్ మిలాద్ మత సామ్రాస్యానికి ప్రతిక





**ఇల్లందు, ఏప్రిల్ 4, ప్రజాజ్యోతి:**

ఈద్ మిలాద్ మత సామ్రాస్యానికి ప్రతిక అని ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. శుక్రవారం జెకె కాలనీలోని బ్లాక్ డైమండ్ గ్రౌండ్ లో జమాతే ఇస్లామి హింద్ ఇల్లందు ఆధ్వర్యంలో ఈద్ మిలాప్ ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జమాత్ ఇస్లామీ హింద్ సంస్థ దేశవ్యాప్తంగా అన్ని మతాలకు చెందిన వ్యక్తుల మధ్య సోదర భావాన్ని, సర్వ విజ్ఞ మత సామ్రాస్యాన్ని పెంచే విధంగా కృషి చేస్తుందన్నారు. మతాలు, కులాలు వేరైనా తామంతా ఒక్కటేనని ఏర్పాటు చేసిన అన్యమత వర్గాల నాయకులంతా, నేడు ఒకే వేదిక పైకి వచ్చి వాళ్లందరికీ కూడా నమస్కారాలు ఎవరు విడదీయలేరని సందేశాన్ని ఇవ్వడం శుభ పరిణామని తెలిపారు. అనంతరం జమాతే ఇస్లామి హింద్ పెద్దలు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ నాయకులు మడుగు సాంబమూర్తి, మండల రాము, భోళ్ల సూర్యం, మడుగు సాంబమూర్తి, చిల్లా శ్రీనివాస్, డి. శివకుమార్, ఉల్లింగ సతీష్, రాయల్ మున్నా భాయ్,ఆఫ్రిద్, ఎస్.కె. జానీ, ఆవునూరి గణేష్, సైదా మియా తదితరులు పాల్గొన్నారు.

